క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

శ్రీశైలభ్రామరికి లక్ష కుంకుమార్చన



లక్షకుంకుమార్చన పరోక్ష సేవగా నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి మార్గశిరశుద్ధ పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. లక్షకుంకుమార్చన పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. లక్ష కుంకుమార్చన పూజలో భాగంగా అర్చకులు, వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇస్తున్న షిర్డీ సాయి

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీసాయిబాబా దేవాలయంలో మంగళవారం శ్రీ దత్త జయంతి వేడుకలు కనుల పండువలా జరిగాయి. వేకువ జామున భక్తులు సాయినాథుని ఆలయానికి చేరుకుని స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. 11 గంటల సమయంలో స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు భక్తులు సత్యసాయి వ్రతంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మధ్యాహ్న హారతి, కాగడ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవ, శయన సేవ కార్యక్రమాలను నిర్వహించారు.

పరిహారం త్వరగా అందేలా చూడాలి

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో స్థలాలు పోయిన బాధితులకు పరిహారం త్వరగా బ్యాంకుఖాతాల్లో జమ అయ్యేలా చేయాలని తంగడంచ గ్రామరైతులు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌ను కోరారు. మంగళవారం వారు తహసీల్దార్‌కు తమ సమస్యను విన్నవించారు. రైతులు కోల్పోయిన భూములు గ్రామకంఠం కింద ఉన్నందున పంచాయతీ కార్యదర్శి రిపోర్టుతో పాటు రైతుల సెల్ఫ్‌డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉన్నందున కాస్త ఆలస్యమవుతుందని తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల్లోగా సమగ్ర నివేదికలను కలెక్టర్, జేసీలకు పంపించి నగదు జమ అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. తంగడంచ గ్రామ రైతులు పిక్కిలిశ్రీనివాసులు, చిన్నరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పగిద్యాల: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెహ్రూనగర్ గ్రామ పంచాయతీలో మండల స్థాయి అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ వ్యాన్‌లోని ప్రొజెక్టర్ ద్వారా లఘు చిత్రాలను ప్రదర్శించారు. సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు/జూపాడుబంగ్లా: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకులు రమేష్‌బాబు పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే జూపాడుబంగ్లా మండలం భాస్కరాపురంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్, ప్రతాప్, చాంద్‌బాషా, అహ్మద్ హుస్సేన్, నాగేశ్వరరావు, రమణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

- మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు క్రీడా పోటీలు
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం పాములపాడు మండల పరిధిలోని వేంపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆడుదాం..ఆంధ్ర క్రీడలు సర్పంచు మాణిక్యమ్మ అధ్యక్షతన అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగరేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే క్రికెట్ బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడానికే ఆడుదాం...ఆంధ్ర పోటీలను సీఎం వైఎస్ జగనన్న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యా, ఉద్యోగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపికృష్ణ, వడ్డేర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు ముర్తుజా, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీఈటీ నాగరాజు, ఎంపీటీసీ బషీర్, వార్డుమెంబర్ ఏసేపు, రమేష్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలను గ్రామ సర్పంచ్ రవియాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శోభారాణి, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మండల కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బతి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, పగిద్యాల, పడమర ప్రాతకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆడుదాం.. ఆంధ్ర క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండలకేంద్రంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన జరిగిన క్రీడాపోటీల ప్రారంభ వేడుకలకు జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఉమ్మడి కర్నూలు జిల్లా ఖో ఖో అసోషియేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లా, మండ్లెం, తాటిపాడు గ్రామాల్లో ఆడుదాం-ఆంధ్ర క్రీడలను ప్రారంభించారు. జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కొత్తపల్లి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంతో గ్రామాలలో ఉత్తమ క్రీడాకారులను గుర్తించి వారికి ఉజ్వల భవిష్యత్తును కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత, ఎంపీడీఓ మేరి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభించారు.

విద్యతోపాటు క్రీడలు తప్పనిసరి

మిడుతూరు: ప్రతి విద్యార్థికి విద్యతోపాటు క్రీడలు తప్పనిసరని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షులు నాగతులసి రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాసపేటలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు జనార్దన్ రెడ్డి, తిమాపురంలో సర్పంచ్ నాగస్వామిరెడ్డి, అలగనూరులో సర్పంచ్ కృష్ణవేణమ్మ, చెరుకుచెర్లలో సర్పంచ్ మరియమ్మ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ మోహన్ కుమార్, గ్రామసర్పంచ్ వాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి ప్రారంభించారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

వెలుగోడు: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తే ఉన్నతంగా రాణిస్తారని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జైపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపం రెడ్డి, మండల కార్యదర్శి కే రామ్మోహన్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్స్ సయ్యద్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం, తెలుగువర్సిటీల మధ్య ఉన్న ఆటస్థలంలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా జరిగిన క్రికెట్, వాలీబాల్‌పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి , సీఐ దివాకర్‌రెడ్డి లకు వైఎస్సార్‌సీపీ మండల రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ సాదరంగా ఆహ్వానం పలికారు. శ్రీశైలం మండల కేంద్రంలో వివిధ క్రీడలకు సంబంధించి 126 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకుని ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నారు.



ఆడుదాం ఆంధ్రా ను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభిస్తున్న ఐటిడిఏ పీఓ , సీఐ , మండల అధ్యక్షులు



మిడుతూరులో జెండా ఎగుర వేస్తున్న నాయకులు, అధికారులు



వెలుగోడులో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

ఆత్మకూరు: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు.పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఉల్లాసంగా ఉండేందుకు, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారులు క్రీడల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించి ఉన్నత స్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. ఆర్‌డీఓ దాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్ సభ్యులు రషీద్, కౌన్సిలర్ రంగన్న, షాలుపైల్మాన్, తహసీల్దార్ ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయచౌదరి, పువ్వాడ భాస్కర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, మొమిన్ మునీర్ బాషా తదితరులుపాల్గొన్నారు.



క్రికెట్‌పోటీలు ప్రారంభిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

క్రీడలకు పెద్దపీట

నందికొట్కూరు: సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట) హైస్కూల్‌లో ఆడుదాం...ఆంధ్ర క్రీడలను మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ముందుగా క్రీడాజ్యోతితో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో నాలుగు క్రీడా మైదానాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తునట్లు చెప్పారు. ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, కోటా హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్, ఖో ఖో, గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్‌లో కబడ్డీ, క్రికెట్, కుంట మైదానంలో క్రికెట్ పోటీలు ఆడుతునట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సలీంబాషా, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి, కౌన్సిలర్లు కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు బ్రహ్మయ్య, షరీఫ్, రసూల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరు క్రీడాజ్యోతి ప్రదర్శన



పగిద్యాలలో రిబ్బన్ కట్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న



బిజినవేములలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు



జూపాడుబంగ్లాలో రిబ్బన్‌కట్‌చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



దుద్యాలలో వాలీబాల్ ఆడుతున్న ఎంపీపీ, సర్పంచులు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్



శ్రీపతిరావు పేటలో క్రీడలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు ,వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి కార్తికేయన్ దంపతులు మంగళవారం శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. స్థానిక అలంకార మండపంలో వేదపండితులు రవిశంకర అవధాని, పండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించారు.



మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి కార్తికేయన్‌ను సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



కొణిదేలలో వికసిత్ భారత్ సభలో పాల్గొన్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన అవసరం అని ఈవోఆర్డీ సంజన్న తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులు 2024కు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నవీన్ కుమార్, ఏఓ షేక్షావలి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ టోర్నీకి అనూహ్య స్పందన

వెలుగోడు: కేపీఎల్ (కార్తీక్ ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి అనుహ్య స్పందన లభించింది. మంగళవారం పట్టణం లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడాకారులకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో క్రీడా ప్రాధాన్యత పెంచుతూ క్రీడాకారులను ప్రోత్సహించడమే అభిమతంగా కార్తీక్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.1,00,000, రూ.50,000, రూ 20,000, రూ.10,000లతో పాటు ట్రోఫీ అందజేస్తామని చెప్పారు. జనవరి 2వ తేదీ లోగా తమ జట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. జనవరి 6వ తేదీ నుంచి పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.



క్రికెట్ కిట్లు అందజేస్తున్న కార్తీక్ రెడ్డి

సాయిబాబాకు పూజలు

వెలుగోడు: స్థానిక సాయిబాబా మందిరంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు మురళి ఆధ్వర్యంలో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో కాశినాయన జ్యోతి ఉత్సవాలు

మహానంది: బుక్కాపురంలోని శ్రీ కాశిరెడ్డినాయన ఆలయంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జ్యోతుల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకురాలు సుబ్బమ్మ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కాశినాయన భక్తులు హాజరై జ్యోతులను సమర్పించారు. హైదరాబాద్ నగరానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు 15 పతకాలు

నంద్యాల(న్యూటౌన్): 6వ స్టైట్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నంద్యాల జిల్లాకు 15 పతకాలు వచ్చినట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి స్టైట్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు నంద్యాల నుంచి అండర్-11 ఏబీసీ కవాంకీ విభాగంలో ఆరిఫ్ బాషా, జఫీవుల్లా బంగారు పతకం, దుర్గా విష్ణుయస్, మహేంద్ర, హర్షవర్ధన్, మన్విత్‌రెడ్డి, మోక్ష, విష్ణు, త్రిణయన్, పవన్‌కార్తీక్‌లు కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. దినేష్, నిరంజన్, దీపక్, దుర్గాలు వెండి మెడల్స్ దక్కించుకున్నారన్నారు.

త్వరలో ప్రజలకు అందుబాటులోకి పీహెచ్‌సీ

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లాలో రూ.1.80కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం వారు నిర్మాణం పూర్తైన ఆరుపడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఆసుపత్రిలో ప్రసవాలు నిర్వహించటంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యసేవలను వైద్యులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకన్న, హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావుపై పిడిగుద్దులు గుద్ది గాయపరిచిన జూపాడుబంగ్లా ఎస్‌ఐ మారుతి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు వ్యవసాయ సంఘం నాయకులు స్వాములు, సంజీవరాయుడు, నరసింహ నాయక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపల్లి మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 22న నందికొట్కూరు పటేల్ సెంటర్ వద్ద రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా శాంతియుతంగా మద్దతు తెలిపేందుకు వెళ్లిన వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, నాయకులు వకీర్ సాహెబ్, బెస్త రాజులపై ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించి వారిపై పిడిగుద్దులతో దాడిచేసి గాయపరిచారన్నారు.

కోలుకోలేక రైతు మృతి

మహానంది: గడ్డి మందు సేవించిన సీతారామపురం గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి జగన్ శ్రీనివాసులు (55) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మహానంది ఎస్‌ఐ జి. నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శ్రీనివాసులు వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. నంద్యాలలో పలు బ్యాంకుల్లో పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. సుమారు రూ.ఆరు లక్షలు అప్పు ఉంది. ఈనెల 24న వరి పొలానికి గడ్డి మందు కొట్టి ఇంటికి వచ్చిన తర్వాత ఇంట్లో గడ్డి మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందారన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

మహానంది: క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మహానంది తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ అన్నారు. మహానందిలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించారు. గాజులపల్లె, బుక్కాపురం, గోపవరం, అబ్బీపురం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచులు చంటి, సుదర్శనం, కల్లె శ్రీలక్ష్మీ, శవ్వా శ్రీలక్ష్మీ, కుంచపు శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, తదితరులు ప్రారంభించారు. బండిఆత్మకూరు మండలం అయ్యవారికోడూరులో ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలను మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎంఈఓ యశోద, తదితర అధికారులు పాల్గొని కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. పార్నపల్లెలో షేక్ షబ్బీర్ అహమ్మద్, ఉప సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డిలు ప్రారంభించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, కడమలకాల్వలో వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, లింగాపురంలో ఎంపీటీసీ అర్జున్, నాయకులు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు క్రీడలను ప్రారంభించారు.



బండిఆత్మకూరులో క్రీడలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- వలంటీర్ల ద్వారా ప్రజల చెంతకే పథకాలు
- శ్రీశైలం - 4 సచివాలయం పరిధిలో నాలుగేళ్లలో 3,993 మందికి సేవలు



మేకలబండ చెంచుగూడెం

శ్రీశైలం: గతంలో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా తహసీల్దార్ ఆఫీసు, జనన, మరణ ధ్రువీకరణ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన వచ్చేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల చెంతకే పాలనను తీసుకువస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలు ఎక్కడికీ తిరగకుండానే ప్రభుత్వం అందించే అన్ని పథకాలను ఇంటి వద్దకే చేరుస్తున్నారు. చదువు రాక పోయినా వారే దరఖాస్తులు నింపి పథకాలు అందేలా చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లలో 4,191 దరఖాస్తులు

శ్రీశైలం 4వ సచివాలయం పరిధిలో 2019 జనవరి 1 నుంచి ఇప్పటి వరకు స్థానిక ప్రజలకు 3,993 సేవలు అందించారు. రేషన్‌కార్డులు, పంచాయితీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ, కుటుంబ ఆరోగ్య సంక్షేమ, కార్మిక ఉపాధి శాఖలు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, జీఎస్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి 4,191 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,993 సేవలు ఆమోదం పొందగా, మరో 185 అభ్యర్థనలకు సంబంధించిన పత్రాలు సరిగా లేకపోవడంతో తిరస్కరించారు. మరో 13 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు సచివాలయ వీఆర్వో ప్రదీప్ తెలిపారు. శ్రీశైలంలో సచివాలయాన్ని 2023 ఏప్రిల్ 26న ప్రారంభించినప్పటికి 2019 నుంచే సున్నిపెంట కార్యాలయం ద్వారా సేవలు అందిస్తున్నారు. శ్రీశైలంలో సచివాలయం ప్రారంభం అయ్యాక కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వలంటీర్లు ఇళ్లవద్దకే వెళ్లి అందజేస్తున్నారు.

మేకలబండలో 90శాతం మందికి రేషన్‌కార్డులు

మేకలబండలో 200కుపైగా చెంచు గృహాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మేకలబండ చెంచుగూడెంలో దాదాపు 500 జనాభా ఉంది. వీరిలో కొందరు దేవస్థానం ఉద్యోగులుగా ఉన్నారు. చాలా మందికి చదువురాదు. ప్రభుత్వ పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియదు. ఒక వేళ చేసుకున్నా గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి, వారే దరఖాస్తు నింపి అర్హతను బట్టి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తున్నారు. గూడెంలో దాదాపు 90 శాతం చెంచులకు రేషన్‌కార్డులు అందజేశారు.

కొత్త రేషన్‌కార్డు వచ్చింది



శ్రీశైలంలోని మేకల బండ గూడెంలో తాతల కాలం నుంచి స్థిరపడ్డాం. నాకు తోకల విజయశివతో పెళ్లై ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రేషన్‌కార్డు ఎలా తీసుకోవాలో, ఆధార్‌కార్డులో మార్పులు ఎలా చేసుకోవాలో తెలియదు. జగనన్న సీఎం అయ్యాక వలంటీర్‌ను మా ఇంటికి పంపించాడు. వారే అన్ని విధాలుగా సహకరించి కొత్త రేషన్‌కార్డు అందజేశారు.

–చిగుర్ల సావిత్రి , మేకల బండ చెంచుగూడెం

వితంతు పింఛన్ మంజూరయ్యింది



కొన్ని సంవత్సరాల క్రితం నా భర్త చనిపోవడంతో ఇద్దరు కొడుకులను కష్టపడి పెంచి పోషించాను. టీడీపీ హయాంలో వితంతు పింఛన్,రేషన్‌కార్డు కోసం తహసీల్దార్ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరిగాం. వైఎస్సార్ సీపీ వచ్చాక వలంటీర్లు ఇంటి తలుపు తట్టి మరీ మా వివరాలు తీసుకున్నారు. 10 రోజుల్లో రేషన్‌కార్డు, నెల తిరిగే సరికి పింఛన్ ఇంటికి వచ్చి ఇచ్చారు.

–పాత్లావత్ చిట్టిబాయి(43), మేకలబండ